ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

**(కేశవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 16-2-96)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీత నాకు చదవాలనిపిస్తోంది. కాని గీతలో భగవంతుడుకృష్ణుడు చెప్పిన మాటలే మరలమరల చెప్పాడు అనిపిస్తోంది అని ఒక జడ్జీగారు భగవాన్‌ను అడిగారు. చెప్పిన మాటలే మరలమరల ఎందుకు చెప్పవలసి వస్తోంది అంటే కొన్ని ముఖ్యమైన విషయములు మనమెదడుకు పట్టటంకోసం అలా చెపుతున్నాడు. చెప్పిన విషయమే మరల చెపుతున్నాను అన్న సంగతి తెలియనివాడు ఏమీకాదు దేవుడు. సందర్భాన్నిబట్టి మరల మరల చెపుతాడు. చెప్పినదే ఇంకోసారి చెప్పినట్లుగా మీకు కనిపిస్తే అది చాలా ముఖ్యమైనదిగా తీసుకోండి. దేవుడు మరల మరల చెపుతున్నాడు అంటే అందులో విశేషం ఉంటుంది. అది మన మెదడుకు పట్టటం లేదు సరికదా రెండోసారి చెపుతున్నాడు అని అంటున్నాము. ఇన్నిసార్లుచెప్పినా అది మన మెదడుకు పట్టటం లేదు అనే గుర్తింపు మనకు రావటంలేదు.

మీరు డైరెక్టుగా ఆత్మను చింతించగలిగితే ఆత్మను చింతించండి. ఆత్మను చింతించలేకపోతే ఇష్టదేవతనుగాని, గురువుగాని నిరంతరము చింతిస్తూ ఉంటే మనస్సు నశిస్తుంది. అప్పుడు నీకు సమాధిస్థితి కలుగుతుంది. సమాధిస్థితి కలిగినపుడు దేహము ఉన్నా,లేకపోయినా, లోకం ఉన్నాలేకపోయినా ఏమీ బేధం అనిపించదు. ధ్యానం చేయగా చేయగా నీకు సమాధిస్థితి కలుగుతుంది అని భగవాన్ జడ్జిగారికి చెప్పారు. సమాధిస్థితి అంటే ఏదో అనుకోకండి. గాఢనిద్రలో మనం ఏస్థితిలో ఉన్నామో అది మెలుకువలోనూ ఉంది. గాఢనిద్రలో ఏ స్థితిలో ఉన్నామో ఆ స్థితిని ప్రయత్నం చేసి మెలుకువలో పొందటమే. దానినే సమాదిస్థితి అంటారు. ఆత్మనుగాని, ఇష్టదేవతను గాని నిరంతరము చింతించటంవలన నీకు సమాధిస్థితి కలుగుతుంది. అప్పుడు శాంతి వచ్చి నిన్ను వరిస్తుంది. నీవు సుఖివి అవుతావు.

మనస్సు ఉన్నంతసేపు వ్యక్తి భావన ఉంటుంది. మనస్సు నశిస్తే వ్యక్తిభావన నశిస్తుంది. మన వాసనలు, అలవాట్లు, రాబోయే జన్మకు హేతువులు అన్నీ మనస్సులో ఉన్నాయి. స్మశానంలో శరీరం కాలిపోయినపుడు ఇవిపోవు. శరీరంనుండి విడిపోవటానికి సాధన అక్కరలేదు. స్మశానంలో ఎలాగూ విడిపోతాము. మనస్సులోనుండి విడిపోవాలి. మనస్సుకు ఏ గుణాలు అయితే ఆధారంగా ఉన్నాయో అవి అన్నీ నశిస్తేగాని మనస్సు నశించదు. నీకు ఉన్న అలవాట్లలోనుండి అజ్ఞానములో నుండి విడిపోవటమే సాధనయొక్క ప్రయోజనము. అప్పుడు ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది.

జీవయాత్ర జరిగిపోతూ ఉండాలి, బ్రహ్మచింతన జరిగిపోతూ ఉండాలి. రెండూ ఒకేసారి జరిగిపోతూ ఉంటే నువ్వు ఒడ్డుకు వస్తావు అని భగవాన్ చెపుతున్నారు. ఈ శరీరం ఉన్నప్పుడే దాని పోషణ చూసుకొంటూ రెండోవైపు బ్రహ్మచింతన చేస్తూఉంటే శరీరం పడిపోయేలోపు బ్రహ్మానుభవం కలుగుతుంది అని భగవాన్ జడ్జిగారితో చెపుతున్నారు. ఇలా జీవిస్తే జీవయాత్ర సాగిపోతుంది, బ్రహ్మానుభవం కలుగుతుంది. రెండు పనులూ జరిగిపోతాయి. ఇది ఉభయతారకంగా ఉంటుంది. ఇలా ప్రయత్నం చేయండి అని భగవాన్ చెపుతున్నారు.

గాఢనిద్రలో మన అలవాట్లు, వాసనలు, కోరికలు అవి ఎలాగ అణిగి ఉంటాయో అదే విధంగా నీ శరీరం మరణించినపుడు కూడా ఇవి అన్నీ మనస్సులో అణిగి ఉంటాయి. భగవంతుడు కొత్త శరీరమును ఎప్పుడు ఇస్తాడా, కొత్త ఇంద్రియాల ద్వారా ఎప్పుడు విజృంభిందామా అని కనిపెట్టుకొని ఉంటాయి. నీవు సాధనచేసి, భగవంతుని ఉపాసనచేసి వాటిలోనుండి బయట పడాలిగాని వాటి అంతట అవి పోవు. నీవు సాధన చెయ్యగా, చెయ్యగా నీ సాధనే దైవానుగ్రహంగా మారి నీవు ఒడ్డుకు రావటానికి అవకాశం కలుగుతుంది.

(అంతా హృదయంలోనే ఉంది అని భగవాన్ అంటారు. ఇన్ని దేశాలు, ఇంతమంది స్త్రీలు, పురుషులు, ఇన్ని నదులు, ఇన్ని పార్టీలు ఇవి అన్నీ ఇంత విశాలమైన విశ్వం అంతా హృదయంలో ఉంది అంటారు ఎలా కుదురుతుంది అని అడుగుతున్నారు. మర్రి విత్తనము ఎంత ఉంటుంది అని భగవాన్ అడిగారు. అది చాలా చిన్నది. మర్రి విత్తనమును భూమిలో పెట్టినపుడు అది మహావృక్షం అవుతుంది. అలాగే నీ హృదయంలో ఉన్న గుణములే ఇన్ని గొడవలుగా మారుతున్నాయి. రూపాలు, నామాలు, గొడవలు అన్నీ నీ హృదయంలోనుండే వస్తున్నాయి. అందుచేత హృదయం లేకపోతే ఏమీలేదు. హృదయంలేకపోతే నేను అనే తలంపు లేదు. నేను అనే తలంపు లేకపోతే మనస్సు లేదు. మనస్సు లేకపోతే దేహం లేదు. దేహం లేకపోతే లోకం లేదు)

దేహం ఉందా, లేదా అన్నది ముఖ్యంకాదు. ప్రపంచం కనబడుతోందా, లేదా అన్నది ముఖ్యంకాదు. మనస్సు నశించిందో లేదో చూసుకోండి. మనస్సే కోపంగా, భయంగా, దుఃఖంగా మారుతోంది. మనస్సు ఉన్నంతసేపు వికారములు తప్పవు. మనస్సు నశిస్తే వికారములు ఉండవు. మనస్సు నశించాక ఇప్పుడు ఎలాగ ఉన్నావో అలాగ ఉండవు. నీవు జ్ఞానివి అవుతావు. అప్పుడు లోకం కనిపిస్తే ఎవడికి కావాలి, కనబడకపోతే ఎవడికి కావాలి. దేహం ఈ భూమిమీద ఉంటే ఎవడికి కావాలి, లేకపోతే ఎవడికి కావాలి అంటున్నారు భగవాన్.

దేహవాసన నుండి మోహం వస్తుంది. మోహం నశించినవాడికి మోక్షం వ్యక్తమవుతుంది. మనం అంతా మోక్షంలోనే ఉన్నాము గాని మనలో ఉన్న మోహం వలన మోక్షంలో ఉన్నాము అన్నసంగతి మనకు తెలియటం లేదు. నీకు బ్రహ్మానుభవం ఎప్పుడైతే కలిగిందో ప్రపంచంలో ఏదీ నిన్ను ఆకర్షించదు. ఎందుచేతనంటే అవి అన్నీ సినిమాలో బొమ్మలులాగా ఉంటాయి. సినిమా చూసినపుడు చంటిపిల్లలు ఆ బొమ్మలు నిజం అనుకొంటారు. పెద్దవాళ్ళు ఇవి నిజంకాదు ఇది సినిమా అని అనుకొంటారు. ఈ నామరూపములు, జనన మరణములు నిజం అని మనం అనుకొంటున్నాము. బ్రహ్మానుభవం పొందినవాడు ఇవి అన్నీ కేవలము నీడలే అని అనుకొంటాడు. మనం ఎవరిమో మనకు తెలియనపుడు లోకం మనలను ఆకర్షిస్తుంది. మనం ఎవరిమో మనకు తెలిసినపుడు లోకం మనలను మోహింపచేయలేదు. తన్ను తాను చూసుకొని లోకాన్ని చూస్తే వాడికి లోకం అంతా తానుగానే కనబడుతుంది. తాను ఎవరు అంటే ఆత్మే. లోకం అంతా ఆత్మగానే కనబడుతుంది. రెండుగా ఉన్నప్పుడు మోహం కలుగవచ్చును. వాడిని చూసి వాడికి మోహం కలుగదు.

నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడిపోవటం తప్పదు. దేహం అంటే అందరికీ ఇష్టమేగాని దేహం మనం కాదు కాబట్టి దేహం మనలను విడిచిపెట్టి పోతుంది. నీదేహం ఉన్నా, లేకపోయినా నువ్వు సమానంగా ఉన్న స్థితి ఒకటి నీ హృదయంలో ఉంది. ఆ స్థితిలోనికి నీవు మేలుకో. గాఢనిద్రలో నుండి మెలుకువలోనికి ఎలాగ వస్తున్నావో అలాగ మెలుకువలో నీవు సాధనచేసి నీ హృదయంలో ఉన్న ఆ స్థితిలోనికి మేలుకో. అలా మేల్కొన్నప్పుడు ఈ దేహం ఉన్నా, ఊడిపోయినా ఒకటే అనే అనుభవం నీకు కలుగుతుంది. ఎందుచేతనంటే దేహం పోయినా నేను ఉంటాను అన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది.

మోక్షం అంటే మన ఇంటికి మనం వెళ్ళటం. అన్నం తినటానికి మనం ఈ భూమిమీదకు రాలేదు. ప్రారబ్ధం అనుభవించటానికి వచ్చాము. ప్రారబ్ధం అనుభవించటం ద్వారా కొంత వివేకం కలుగుతుంది. మహాత్ములు, శాస్త్రములు చెప్పిన మాటలు సత్యం అయినప్పటికి మన మనస్సుకు అవ్వవలసిన అనుభవాలు అన్నీ అయితేగాని ఆ వాక్యములలోని సత్యాన్ని మన మనస్సు నమ్మదు. పుట్టటం, చనిపోవటం ఇలా కొన్ని జన్మలు అయిన తరువాత, ప్రారబ్ధం అంతా ఖర్చు అయిన తరువాత ఏదో మహాగురువు అనుగ్రహం వలన మన ఇంటికి మనం వెళతాము.

వ్యాపారం చేయటానికి పెట్టుబడి కావాలి కాని జ్ఞానమును సంపాదించటానికి జ్ఞానం సంపాదించాలనే కాంక్షే పెట్టుబడి. నటనకోసం కాకుండా జ్ఞానమును తెలుసుకోవాలి అనే కాంక్ష నీ హృదయంయొక్క లోతులలోనుండి వస్తూఉంటే ఆ కాంక్షే పెట్టుబడిగా మారి నీకు ఫలితమును చేకూరుస్తుంది. జ్ఞానమును తెలుసుకోవాలి అనే కాంక్ష మహాత్ముల దర్శనంవలన నీకు కలుగుతుంది. నీ హృదయంలో ఉన్న సత్యము అనుభవంలోనికి వచ్చేవరకూ బాహ్యముగా ఉన్న సత్పురుషులతో సహవాసం చేయటం నేర్చుకో.

నా మనస్సు బాగాలేదు. నా దేహము బాగాలేదు అంటున్నావు. నా మనస్సు, నాదేహం అంటున్నావు. నా మనస్సు అన్నప్పుడు మనస్సుకంటే వేరుగా ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది. నా మనస్సు, నా దేహము అని నీలో ఒకడు అంటున్నాడు. వాడు ఎవడో తెలిస్తే నీవు సుఖివి అవుతావు. ఈ జనన, మరణ ప్రవాహమునుండి ఒడ్డుకు వచ్చేస్తావు. మనలో రెండు నేనులు ఉన్నాయి. ఒకటి సత్యమైన నేను, రెండవది అసత్యమైన నేను. కృష్ణుడు నన్ను ప్రేమించు, నన్ను జపించు అంటున్నాడు అంటే ఆ శవాన్ని ప్రేమించమని కాదు. కృష్ణుడు చెప్పే నేను సత్యమైనది. అది స్వతంత్రమైనది. మనం చెప్పే నేను దేహగతమైన నేను. అది అసత్యమైన నేను. అహంభావనతో కూడినటువంటి నేను. ఏ తలంపు వచ్చినా దేహగతమైన నేనుకు వస్తుంది. కోపం వచ్చింది అనుకోండి. ఈ కోపం ఎవరికి వస్తోంది? అని ప్రశ్నించుకోండి. నేనుకు వచ్చింది అని తెలుస్తుంది. అప్పుడు ఈ నేను ఎవరు? అని ప్రశ్నించండి. అప్పుడు అది దాని మొదలులోనికి జరగటం ప్రారంభిస్తుంది. ఆ నేను ఎప్పుడైతే మొదలులోనికి జరగటం ప్రారంభించిందో ఆ నేనుకు వచ్చే వికారములు అన్నీ పడిపోవటం ప్రారంభిస్తాయి. నేను ఎవడు అను విచారణవలన నేను అణుగుతుంది. దేహం విచారణ చేయదు. లోపల ఉన్న నిజం విచారణ చేయదు. దేహానికి, లోపల ఉన్న నిజానికి మధ్యన ఉన్న దేహగతమైన నేనే విచారణ చేస్తుంది. దానిచేతే విచారణ చేయించి దానినే చంపాలి. అదే సాధన.

ధ్యానం చేసేటప్పుడు శాంతి, ఆనందము కలుగుతున్నాయి. ధ్యానంనుండి లేచిన తరువాత మరల నా గొడవలు అన్నీ వచ్చేస్తున్నాయి. ధ్యానం చేసేటప్పుడు ఉన్న శాంతి నన్ను విడిచిపెట్టకుండా ఉండాలంటే ఏమి చేయాలి అని అడుగుతున్నారు. ధ్యానంనుండి వచ్చిన తరువాత ఏ తలంపులు అయితే వస్తున్నాయో ఆ తలంపు తాలుక వాసన నీ హృదయంలో ఉండి ఉండాలి. ఆ వాసన కాలి బూడిద అయ్యేవరకూ ఆ తలంపు నిన్ను విడిచిపెట్టదు. అదే బంధం, వాసన నశిస్తేనేగాని తలంపు నశించదు. వర్షాలు కురవకముందు పచ్చగడ్డి నీకు కనబడదు. రెండుసార్లు వర్షాలు పడేటప్పటికి పచ్చగడ్డి వచ్చేస్తుంది. అది ఎక్కడనుండి వస్తోంది అంటే లోపల ఎక్కడో విత్తనం ఉంది. అది చావకుండా ఉంది. అవకాశంకోసం ఎదురు చూస్తోంది. వర్షం కురిసిన వెంటనే దానికి అనుకూలమైన పరిస్థితి వచ్చి గడ్డిక్రింద వచ్చేస్తుంది. అదేవిధంగా నీలోపల వాసన ఉంటే నీశరీరంపోయినా కాని అది అనుకూల పరిస్థితికోసం చూసుకొంటూ ఉంటుంది. దానికి అనుకూలమైన పరిస్థితి వచ్చినపుడు శరీరం తొడిగేస్తుంది. ఇదే సృష్టి అన్నారు భగవాన్. చెట్టు రొబ్బలు, కొమ్మలు నరికేసినప్పటికి అది

చావదు. లోపల విత్తనం ఉన్నంతసేపు అది బ్రతికి ఉన్నట్లే. అదే విధంగా నీవు బాహ్యంగా ఏదో సంస్కారములు పొందినప్పటికీ, తలంపులను కంట్రోలు చేసినప్పటికీ ఆ తలంపుల తాలూక వాసన నీలో ఉంటే ఆ వాసనే నీకు దేహమును తెచ్చిపెడుతుంది. విత్తనంలోనుండి గడ్డి వచ్చినట్లుగా. ఇది ప్రకృతి చేసుకుపోతుంది. వాసన వేరుతోసహా నశిస్తే నీ స్వరూపం నీకు వ్యక్తమవుతుంది. మోక్షంలోనే ఉన్నావన్న సంగతి నీకు ఎరుక పడుతుంది. వాసనలను తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చెయ్యి, నీవు ప్రయత్నం చేయగా చేయగా నీ ప్రయత్నమే అనుగ్రహంగా మారి నీకు సహకరిస్తుంది.

ఎవడైతే శాంతిగా ఉన్నాడో వాడిదగ్గర కలహాలు తీసుకొనివద్దామన్నా తీసుకొనిరాలేము. ఎందుచేతనంటే కలహకారణాలు అక్కడ లేవు. నీకు శాంతి, ఓర్పు ఉంటే పేచీలకు కారణములు ఉన్నా నీ ఓర్పువలన పేచీలకు కారణములు ఆరిపోతాయి. అగ్గిపుల్ల వెలిగించి అక్కడ వేసాము అనుకోండి. అక్కడ గడ్డి ఉంటే అంటుకొంటుంది. గడ్డిలేకపోతే అంటుకోదు. అలాగే శాంతిగా ఉన్నవాడిని మనం కలహాలలోనికి తీసుకొని రాలేము. ఎందుచేతనంటే కలహాలు అన్ని అక్కడ ఆరిపోయి ఉంటాయి. కలహం పెరగటానికి అక్కడ గడ్డి ఉండదు.

సత్యములో సౌందర్యము ఉంది. సౌందర్యములో సత్యము ఉంది. సత్యమే నిత్యముగా ఉంటుంది. సత్యము కానిది నిత్యముగా ఉండదు. నీ దేహమే సత్యం అనుకో, నీ జీవుడే సత్యం అనుకో, ప్రపంచమే సత్యం అనుకో గాఢనిద్రలో దేహ భావన, లోక భావన పోవటానికి వీలులేదు. గాఢనిద్రలో వీటి గొడవ లేదు కాబట్టి అవి సత్యంకాదు. మనస్సు వచ్చాక దేహము, లోకము వస్తున్నాయి. మనస్సు నశిస్తే అవికూడా నశిస్తాయి.

అహంభావన ఉన్నంతకాలము సాధన తప్పదు. ఎంతవరకు సాధన చెయ్యాలి అంటే నీలోని జీవలక్షణాలు నశించే వరకూ సాధన చెయ్యాలి. ఎప్పుడైతే నీలోని జీవలక్షణాలు నశించాయో అప్పుడు సాధన చేయటానికి ఏమీ ఉండదు. జీవలక్షణాలు నశించేవరకూ సాధన చేయకుండా ఉండలేరు. సాధనచేసేవాడు ఉన్నంతవరకు సాధనజరగాలి. బ్రహ్మానుభవం కలిగిన తరువాత సాధన చేసేవాడు మిగలడు అప్పుడు మీకు సాధనతోటి పనిలేదు. ఎవడికైతే జీవలక్షణాలు నశించాయో, దేహబుద్ధి నశించిందో వాడూ పనిచేస్తూ ఉంటాడు అంటే వాడిద్వారా పని జరుగుతూ ఉంటుంది. వాడి ప్రయత్నం లేకుండా పనిజరుగుతుంది. వాడికి ఒకేసారి Work, rest జరిగిపోతూ ఉంటాయి.

నీ దేహమునకు రోగము వస్తే ఆ రోగమునకు కారణము ఉంటుంది. రోగ కారణము తెలిస్తే నివారణకూడా నీకు తెలుస్తుంది. అలాగే నీ దుఃఖానికి కూడా కారణం ఉంటుంది. నీకు దుఃఖము వస్తూ ఉంటే దానికి కారణం ఉండి ఉండాలి. ఏ కారణం వలన నీకు దుఃఖము వస్తోందో తెలిస్తే దానికి నివారణ కూడా ఉంటుంది. రోగ కారణము తెలియకుండా రోగము తగ్గదు. అలాగే నీ దుఃఖ కారణము తెలియకుండా దుఃఖము నశించదు. నీకు దుఃఖకారణము తెలిస్తే దానికి నివారణను భగవంతుడు సూచిస్తాడు. నీ కంట్రోలర్ నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయన మీద విశ్వాసం పెరుగుతూ ఉంటే అక్కడనుండే గైడెన్స్ పంపిస్తాడు.

మీరు డైరెక్టుగ ఆత్మను ధ్యానం చేయగలిగితే ఆత్మనుధ్యానం చెయ్యండి. ఆత్మను ధ్యానం చేసే శక్తి నీకు లేకపోతే మీ ఇష్టదేవతనుగాని, గురువును గాని ధ్యానం చెయ్యండి. అది Unbrokenగా ఉండాలి. నిరంతరము చేయాలి. అలాచేస్తే సమాధి స్థితి కలుగుతుంది అని భగవాన్ చెపుతున్నారు.

★★★